# ఎవరింట్లో పూస్తేనేం?

మా ఇల్లు బొమ్మరిల్లు, మా సంసారం లిక్కి సంసారమూను. ఇరవై ఏళ్ళ క్రితం ఇండిపెండెంట్‌గా మేం కాపరం పెట్టిన కొత్తలో - అప్పటికి మావారికింకా సార్వభౌమాధికారాలు సంక్రమించలేదు. మాది డొమినియన్ స్టేటస్...చిన్న గుండుపప్పు గిన్నెకొనమంటే, అవసరమో కాదో అమ్మకు ఉత్తరం రాసి కనుక్కుంటాను అనేవారు మా గురూగారు. మేం సంసారం పెట్టిన ఎర్లీడేస్‌లో అంటే ట్వెంటీ ఏళ్ళక్రితం రేకు గిన్నెలో తలగొట్టి తవ్వెడు బియ్యం అత్తెసరు కుంపటిమీద పడేస్తే అది మా ఇద్దరికీ ఎక్కితక్కిఅయి తినలేక గుడ్లు తేలేసేవాళ్ళం.

మా కిద్దరికీ ఓ పూటకు సరిపడే కూర అల్లం పచ్చిమిరపకాయలు అండ్ అల్సో ఉల్లిపాయలు మావారు కొని ప్యాంటు జేబులో పోసుకొచ్చేవారు ఇప్పుడు మా ఇంట్లో కూరల్సంచీ అప్పుడు మాకు బియ్యపు సంచి ఇన్ దోజ్ డేన్ పావలాపెట్టి పకోడీలు మిఠాయి కొమ్ములు రెగ్యులర్‌గా తెచ్చేవారు. బాత్‌రూంలోంచి వచ్చే వాటర్ వేస్టవకుండా అక్కడో చిన్న సన్నజాజి పందిరి ఒకసల్లె అంటు, ఒక గులాబి మొక్కవేసి జాగ్రత్తగా పెంచాను. బియ్యం కడుగు. మేక పెంటికలు ఏరుకొచ్చి వేసి అక్కడే కూర్చునే దాన్ని అవి ఎప్పుడు మొగ్గ తొడుగుతాయా, పూస్తాయా అని

ఆలోచిస్తూ, చిన్న మొగ్గవేస్తే, ఏ గులాబీ చెట్టేనా పూస్తే, పందిరిమీదకు సన్నజాజి తీగలు బులి బులి ముండలలే ప్రాకుతూంటే నాకెంతో సంతోషంగానూ, గొప్పగానూ వుండేది. నేనా మొక్కలకు తాళ్లుకట్టి, చిన్న కర్ర ముక్కలతో సపోర్టులు పెట్టి చుట్టూ బోదెలుచేసి ఆ కాస్త జాగాలో నందనోద్యానాన్ని సృష్టించుకుని మురిసిపోయేదాన్ని. నా తన్మయత్వం నా మురిపాన్ని చూసి మా వారు నేనో క్రాక్ ననుకున్నారు. డామిట్ ! మొక్కల సంగతి మీకు తెలిత్తెలీదు-అని నా ఫ్రెండ్సు అని దబాయించే



దాన్ని. ఒక అజా పెట్టి రోజూ పూలు కొనుక్కోరాదా అనేవారు. మా వారు. కొంచెం బ్రూట్-నేను నా మొక్కలతో మాట్లాడుతూ కూర్చునేదాన్ని. అని నా మాటల్ని వింటూన్నట్లు గాలికి కదుల్తూ నాతో ఆడుకునేవి. ముండల్లారా దాహం వేస్తోందా అని నీళ్లుపోసి కొమ్మల్నీ, రెమ్మల్నీ ఆకుల్ని సర్ది పోట్లాడుకోవద్దని చెప్పి నాకు తెలిసిన పిచ్చి పాటలన్నీ పాడి వాటికి వినిపించేదాన్ని. అవి నా మాటలకు తల వూపినట్లే నా పాటలకు కూడా తలవూపేవి నా పాత ఉత్తరాలన్నీ ఆ మొక్కల దగ్గర చాపేసుకుని కూర్చుని చదువుకునేదాన్ని. ఆ ఉత్తరాల్లోని సంగతులన్నీ బహుశా వాటికి తెలుసు. నన్నోసారి మావారో లెంపకాయ కొడితే నేనక్కడే కూర్చుని ఏడిచాను. వాటిని చూసి నేను మౌనంగా గంభీరంగా వుండటం

కూడా నేర్చుకున్నాను. వాటిని చూసే సంసారాన్ని పచ్చగా కలకల లాడు తున్నట్లు తీర్చిదిద్దుకోవడం కూడా నేను నేర్చుకున్నాను.

ఓ పక్క కుర్రతనం—ఆ కుర్రతనానికి సరిపడని భయంకరమైన ఒంటరితనం——ఒంటరితనానికి తోడై చిలిపి వూహలు నన్ను బాధించ కుండా నేను మొక్కలతో కాలక్షేపం చేసేదాన్ని. మా ఇంట్లో ఒక పిచిక ఫామిలీ వుండేది. మధ్యాహ్నం వంటిల్లు కడిగేసి గదిలో మంచంమీద వెల్లికిలా పడుకుని పిచిక సంసారం గురించి స్టడీ చేస్తూండేదాన్ని. అవి కిచకిచమని కబురు చెప్పుకుంటూ హడావిడి చేస్తూ గదంతా తిరిగేవి. కిటి కీల్లోంచి బయటకు వెళ్లి మళ్ళీ ముక్కున ఏకో కర్చుకుని వస్తూ యమ బిజీగా వుండేవి. అవి మాట్లాడుకోవటం నా గురించీ మావారి గురించేమో నని నాకు లోపలడవుటుగా వుండేది. తెలుసుకుందామంటే పిచిక భాష రాదుగదా.

బట్టలు ఉతుక్కుని వాటిని ఆరేసుకునే వేళకు దండాలమీదవచ్చి వ్రాలేవి బోల్డుకాకులు. కాకులు ఆ శాళ్ళను అటే కేర్ చేయవు. ఓ పక్కకు మొగంపెట్టి దొంగరాస్కెల్సు మల్లే అవి నాకేసి చూసేవి. రవుడీ కాకుల్లారా పొండర్రా పొండి అని తడిబట్టలు పిండి ఆరేస్తూ వాటిని కసిరే దాన్ని. అవి అటూ యిటూ ఎగురుతూ ఎంగిలి కంచాలు కడిగినచోట పారే సిన మెతుకుల కోసం కూరముక్కల కోసం బాత్రూంలో మర్చిపోయిన సబ్బుబిళ్ళల కోసం నేతి చెంచాకోసం నేతి గరిట కోసం నన్ను ఏడిపించు కుని తినేవి. అప్పుడప్పుడు చుట్టాలల్లే మా మదుర గోడమీదకు కోతు లొచ్చేవి. కోతులు వస్తే తలుపులు బిగించుకుని గదిలోకి పోయి ఇల్లు సర్దు కుంటూనో, లేసు అల్లుకుంటూనో కిటికీ దగ్గర స్టూలు వేసుకుని కూర్చునే దాన్ని, అవి నాకేసిచూసి పళ్లికిలించి పెంకుల్ని యిటూ అటూ తిరిగేసి చేతి కందినవి పట్టుకుపోయి నానాఅల్లరి చేసేవి. కథల పుస్తకాలు చదివే ఓపిక కూడా నాకుండేదికాదు. బాగారాసినవి తెలిసి చచ్చేవి కావు. బాగా రాయనివి మనసుకు నచ్చేవి కావు. మావారు ఆఫీసొదలంగానే యింటికి రాకూడదా, వచ్చి నాకు కంపెనీ యివ్వకూడదా అనిపించేది. దెబ్బలాడి మా వూరెళ్లి

పోతే బావుండ్ననిపించేది. కాని ఒకరోజు పోట్లాట వేసుకున్నా మళ్ళీ పర్నాడు పోట్లాడేందుకు ఎవరూ ఉండరు కదా? ఎలా తోస్తుందీ అన్న డవుటుండేది. అదీగాక మావూళ్ళో నా వయస్సు అమ్మాయి లందరూ కాప రాలకెళ్ళిపోయుంటారు కదా! అక్కడ కూడా దిక్కుమాలిన ఒంటరితనమే ఎపరయేటప్పుడు యిక్కడే నోరు మూసుకు పడుండడం మేలనిపించేది.

ఈ పంచం ఆ మూలకులాగి ఆ కుర్చీ యీ మూలకులాగీ బల్లలు సర్ది గిన్నెలు తుడిచీ అలమార్లు సర్ది ఎంతకీ కాలక్షేపం కాక చివరకు మొక్కలతో ఫ్రెండ్‌షిఫ్ పెట్టుకున్నాను. ముందు మురికిగా తడిగా చెత్త చెత్తగా వున్న జాగాను శుభ్రంచేసి చిన్న చిన్న సైడ్ కెనాల్స్ తవ్వి అక్కడ నీరు నిలచిపోకుండా పెంకులతో,రాళ్ళతో సైడ్‌వాల్స్ తూములు, డాములు, ఆనకట్టలు కట్టి ఆల్మోస్ట్ ఆడుకునేదాన్ని, మట్టితో నీళ్ళతో ఆడు కోవటం నాకు చిన్నప్పట్నుంచీ అలవాటు — నేను మొక్కల్నీ మొటికల్నీ పెంచటం వచ్చాక రోజూ శ్రీవారితో దెబ్బలాటే—ఆయన్ని నా మొక్కల దగ్గర మొహం కడుక్కో నిచ్చేదాన్ని కాను. ఆ ఎసైటంతా నాది అక్కడి ఉమ్ములేసినా, పళ్ళు తోముకుని గలీజు చేసినా వూరుకునేదాన్ని కాదు. బ్రహ్మరాక్షసిలా మీదపడిపోతా వేమని విసుక్కునేవారు. నేను మళ్ళీ పుట్టింటి కెళ్ళాల్సిన యమర్జన్సీ ఓటొచ్చి పడింది. అప్పుడు మొక్కల్ని జాగ్రత్తగా చూడండని శ్రీవారికి పదేపదే చెప్పాను. విసుక్కున్నారేమో— నేను మళ్ళీ ఆరేడునెల్లు పుట్టింట్లో బైతాయించి మా కులదీపాన్ని ఎత్తుకుని వచ్చేసరికి యిల్లు మార్చేశారు. కొత్త యింట్లోకి మారటం అట్టే సుఖమైన డైవర్షన్‌కాదు. నా మొక్కల గురించి ఏం చేశారని మావార్నడిగాను. ఇంటివారమ్మాయిలు ముచ్చటపడితే యిచ్చేశానన్నారు. నాకేడు పొచ్చినంత పనైంది. ఇంటివారమ్మాయి కెన్నేళ్ళు అని కన్నీళ్లు నాపుకుంటూ అడి గాను. వాళ్ళ సరోజ నెరగవూ బియస్సీ మూడుమాట్లు తప్పింది ఆ పిల్లే వచ్చి అడిగి పట్టుకుపోయింది ఇష్టైహీ అన్నారు. దీని బియస్సీ తెలివితేటలు తగలెయ్యా....నేసుండగా రాలేదు, వస్తే కాళ్ళమీద చేతులు మీదా వాతలు

పెట్టేద్దును అనుకున్నాను. మావారన్నారుగదా? యిప్పుడు మనం కాశీచేశాక దొడ్డంతా సిమెంట్ గచ్చు చేసేశారు. నువ్ పాపం మట్టితో, గలీజుతో నానా అవస్థా పడేదానివి, దొడ్డి అంతా చితపతలాడుతూ వుండేది అని.

నా గుండెలమీద ఎవరో సిమెంటుతో గచ్చు చేసినట్లనిపించింది, నా పిచ్చి ముండలు సన్నజాజీ గులాబీ మల్లె అంట్లు ఎలావున్నాయో కదా అని నాచేత్తో పెంచిన మొక్కల్ని, ఆ బియస్సీ తప్పిన దిబ్బ మొహం దానికి దానంచేసిన మావారి చవటతనానికి నాకు వొళ్ళుమండుకు పోయేది, వాటికి నీళ్లుపోసి పెంచారనుకున్నారా ఏవిటి? నే పాటలు పాడి కబుర్లుచెప్పి వాటిని సాకాను. ఎవరైతే మటుకు దొడ్డంతా గచ్చు చేయగల్రుగాని నా మనసు లోని జ్ఞాపకాలను సిమెంటుపోసి గచ్చు చేయలేరు గదా! అసందర్భపు మనుషులింట్లో వున్నప్పుడు ఆటువంటి మపకారాలను ఇక ముందెన్నడూ పెట్టుకోదల్చుకోలేదు. ఎవరింట్లో పూస్తేనేం-అవి నేను పెంచిన గులాబీ, సన్నజాజి మల్లె మాలతులు కదా! ప్చ్!